క్లుప్తంగా

వైభవంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



బిక్కవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

బిక్కవోలు: గ్రామంలోని ఇమామ్ మదీనా మసీదులో సోమవారం మీలాద్- ఉన్ -నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు ప్రపంచ శాంతి ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహ్మద్ షహజాద్ అష్రఫి మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జీవితం మోక్ష మార్గమన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న అణగారిన వర్గాలను ఆదుకోవాలన్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా శాంతి మంత్రాన్ని వీడరాదన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలోని షేక్ మహబుబ్ జానీ, షేక్ అక్రం బాషా, పందలపాక మసీద్ ఇమామ్ గూలమ్ గౌసీ పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి టోర్నమెంట్

రాజానగరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మండల స్థాయి టోర్నమెంట్ ప్రారంభం కానుందని కన్వీనర్లుగా వ్యవహరిస్తున్న ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో వాలీబాల్, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌కు సంబంధించి అండర్ 14, 17 విభాగాలలో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

120 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పెదపూడి: కరకుదురు గ్రామంలోని హౌస్ ఆఫ్ ప్రేయర్ జోసెఫ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో సోమవారం కాకినాడ విజన్ ఐ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మలిపెద్ది శ్రీనివాస్, మలిపెద్ది త్రిమూర్తులు ఈ శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేయడానికి వివరాలు నమోదు చేసుకున్నారు. శిబిరాన్ని ప్రారంభించిన పాస్టర్ బి.ప్రేమ భూషణం మాట్లాడుతూ వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాల్ తిలక్, సీయోనురాజు, దీవెన రాజు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ షెడ్డు ప్రారంభం



పెద్దాడలో సైకిల్ షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: పెద్దాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.3.80 లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్డును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం ప్రారంభించారు. కుమారప్రియం సొసైటీ నిధులతో ఈ నిర్మాణం చేపట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ యార్లగడ్డ అమ్మన్న చౌదరి, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

సీఈఓ వర్మ సేవలు అభినందనీయం



సుధాకర్ వర్మ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

మధురపూడి: కోరుకొండ పీఏసీఎస్ సీఈఓ గొట్టుముక్కల సుధాకర్ వర్మ అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ సన్మాన సభ సోమవారం కణుపూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన మిత్రులు, బంధువులు, సహ ఉద్యోగులు విచ్చేసి.. వర్మ దంపతులను సన్మానించారు.

వరద బాధితులకు విరాళం

కడియం: విజయవాడ వరద బాధితులకు సాయంగా పలువురు విరాళాలు అందజేస్తున్నారు. కడియం మండలంలోని నర్సరీ అసోసియేషన్, రైతులు, వివిధ పార్టీలు, మహిళా సంఘాలు ఇప్పటికే విరాళాలు అందించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా షిర్డిసాయి స్కూలు యాజమాన్యం రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి సోమవారం అందజేసింది. వీరవరం టీడీపీ గ్రామ కమిటీ తరఫున రూ.20 వేలు, దుళ్ల గ్రామానికి చెందిన నర్సరీ రైతు యన్నమని లక్ష్మీపతి రూ.1,116లను విరాళంగా అందించారు.



కరకుదురులో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు



రాజానగరంలో ఊరేగుతున్న గణనాథుడు



చంద్రేడులో జరుగుతున్న గణేశుని ఊరేగింపు

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా..

- జోరుగా విగ్రహాల నిమజ్జనాలు
- గణనాథున్ని సాగనంపిన భక్తులు
- వైభవంగా ఊరేగింపులు
- ఆలయాల వద్ద అన్నసమారాధనలు



పందలపాకలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: నవరాత్ర ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న వినాయకుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరాడు. వెళ్లిరా గణపయ్యా అంటూ భక్తులు.. గణేష్ విగ్రహాలను సాగనంపారు. ఉదయం 6 గంటల నుంచే మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, యువకులు డ్యాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ వేడుకగా ఊరేగింపులు జరిపారు. బిక్కవోలులోని పెద్ద కాలువ, కొమరిపాలెం, తొస్సిపూడి, పందలపాక, కొంకుదురు గ్రామాలలో తుల్యభాగ నది కాలువలలో నిమజ్జనాలు జరిగాయి. ఊలపల్లి, ఆరికరేవుల, బలభద్రపురం, ఆర్ఎస్‌పేట, కాపవరం, మెల్లూరు, రంగాపురం, ఇలపల్లి తదితర గ్రామాలలో విగ్రహాల నిమజ్జనం జరిగింది. ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేకంగా క్రేన్లు ఏర్పాటు చేసి, వాటి సాయంతో విగ్రహాలను కాలువలో నిమజ్జనం చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా గజ ఈతగాళ్లను నియమించారు.



పెదపూడిలో గణనాథుడిని ఊరేగిస్తున్న చిన్నారులు



రంగంపేటలో వినాయక విగ్రహం ఊరేగింపు

పెదపూడి మండలంలో..

పెదపూడి: దోమాడ, కరకుదురు, ఏపీత్రయం, జి.మామిడాడ, సంపర, పెదపూడి గ్రామాలలో గణనాథుల నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. పెదపూడిలో ఆటో యూనియన్, కావమ్మ చెరువు కొత్తపేట వినాయకుడు, మెయిన్‌రోడ్డులో గణపతులను ఊరేగించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన వీధుల మీదుగా జరిగిన ఊరేగింపులు ఆకట్టుకున్నాయి. ఏపీత్రయంలో పశ్చిమ ఏలేరు కాలువ, కరకుదురు శివారు అరట్లకట్ల కాలువ, సంపరలో తుల్యభాగ నదీపాయ తదితర ప్రాంతాలలో నిమజ్జనాలు చేశారు. ఆయా ఆలయాల వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. పెదపూడి ఎస్సై రామారావు, తహసీల్దార్ సీతాపతిరావు ఆధ్వర్యంలో సిబ్బంది కాలువల వద్ద బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా ఊరేగింపు

రాజానగరం: గణపతి విగ్రహాల నిమజ్జనాలు మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఊరేగింపులను వైభవంగా నిర్వహించారు. రాజానగరంతో పాటు పరిసర గ్రామాల నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చిన విగ్రహాలను సమీపంలోని చాగల్నాడు, పుష్కర కాలువలు, ఫరిజల్లిపేటలోని ఊర చెరువు, సూర్యారావుపేట మునమళ్ల చెరువులోనూ నిమజ్జనం చేశారు. దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, నామవరం, కొండగుంటూరు, జి.యర్రంపాలెం, తుంగపాడు గ్రామాలలోని విగ్రహాలను ఊరేగింపుగా రాజమహేంద్రవరం తీసుకువెళ్లి, అఖండ గోదావరిలో నిమజ్జనం చేశారు. వివిధ రకాల శక్తి వేషాలతో ఉన్న కళాకారులు ఈ ఊరేగింపుల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

భక్తిశ్రద్ధలతో..

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాల సందర్భంగా భారీ ఊరేగింపులు నిర్వహించారు. రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో నెలకొల్పిన విగ్రహాలను ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అట్టహాసంగా ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వైభవంగా ఈ కార్యక్రమాలు జరిగాయి. స్థానికంగా ఉన్న చెరువులతో పాటు రాజమహేంద్రవరం గోదావరిలో నిమజ్జనాలు జరిగాయి. అంతకు ముందు ఆయా మండపాల వద్ద లడ్డూ వేలాన్ని కోలాహలంగా నిర్వహించారు.

సీతానగరం మండలంలో..



మునికూడలిలో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మునికూడలి వద్ద నార్త్‌జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్సై రామ్‌కుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పర్యవేక్షణలో వినాయక విగ్రహాల నిమజ్జనలు జరిగాయి. భక్తులు వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల్లో వైభవంగా ఊరేగించి, రేవుల వద్ద నిమజ్జనం చేశారు. మండలంలోని వంగలపూడి, ముగ్గళ్ల, మునికూడలి, జాలిమూడిలో రేవులను నిమజ్జనం కోసం ఎంపిక చేశారు. మునికూడలిలో పడవలను ఏర్పాటు చేశారు. వాటిపై విగ్రహాలను ఎక్కించి గోదావరి మధ్యలో వదిలిపెట్టారు. కానిస్టేబుల్ ప్రసాద్, సచివాలయ మహిళా పోలీస్ భూదేవి, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు డీ వార్మింగ్ డే



సీతానగరం పీహెచ్‌సీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన (డీవార్మింగ్ డే) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ కె.జయమణి తెలిపారు. రంగంపేట, సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,658 మంది పిల్లలున్నారని, వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించామన్నారు.

సీతానగరం: నూలి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజు, సిబ్బంది సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ సుధాకర్, స్టాఫ్ నర్స్ నాగమణి, హెచ్ఎ నందీశ్వరరావు, ఫార్మాసిస్ట్ నగేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



హోటల్‌ను పరిశీలిస్తున్న శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, తోపుడుబండ్ల వ్యాపారులు, హోటళ్ల యజమానులు తయారు చేసే ఆహార పదార్థాలు నాణ్యతతో ఉండాలని శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ అన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలపై సోమవారం నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు, స్వీట్ స్టాళ్లను ఆయన పరిశీలించారు. అక్కడ వంటగది పరిసరాలు, ఆహార పదార్థాలు నాణ్యతపై ఆరా తీశారు.

టేబుల్ టెన్నిస్‌లో త్రిషాల్ సత్తా

ప్రకాశం నగర్: గౌతమి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు త్రిషాల్ రాజ్ కుమార్ జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటి, సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ విషయాన్ని కోచ్ వీటీవీ సుబ్బారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా రెయిన్‌బో అకాడమీలో ఈ నెల 11న ప్రారంభమైన పోటీలలో అండర్ - 15 బాలుర విభాగంలో ఈ ఘనత సాధించాడన్నారు. ఈ సందర్భంగా త్రిషాల్‌ను జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భాస్కర్ రామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి తదితరులు అభినందించారు.

వినాయక ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ



వరసిద్ధి వినాయకున్ని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వినాయక చవితి ఉత్సవాలతో అంతటా ఆధ్యాత్మిక శోభ నెలకొందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని బుల్లియ్య తోటలో లక్ష్మీగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వరసిద్ధి వినాయకుడిని సోమవారం డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. అనపర్తిలో ఎస్‌సీఆర్ ఫ్రూట్స్ కంపెనీ దగ్గర ఉన్న గణనాథునికి పూజలు నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా మహాన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీని అభినందించారు.

వైష్ణవి రైస్ ఇండస్ట్రీ పరిశీలన

అనపర్తి మండలం పెడపర్తి గ్రామంలోని వైష్ణవి రైస్ ఇండస్ట్రీని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఆ ఫ్యాక్టరీలో ఈ నెల 15వ తేదీ ఉదయం విద్యుత్ ప్రమాదం సంభవించింది. ఆ ఘటనలో ఇండస్ట్రీ మెయిన్ ప్యానెల్ బోర్డు కాలిపోయి సుమారు రూ.45 లక్షల ఆస్తినష్టం జరిగింది. ఈ సందర్భంగా యాజమాన్యంతో సూర్యనారాయణరెడ్డి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంటన సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నాయకుల దాడి

బిక్కవోలు: మండలంలోని కాపవరం గ్రామంలో జరిగిన వినాయక నిమజ్జనంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నాయకులు దాడి చేశారు. గ్రామ సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, సత్యంశెట్టి వర ప్రసాద్, కొట్టు శ్రీనివాస్, సత్యంశెట్టి ఆనంద్ రాజ్, సత్యం శెట్టి సుధీర్, సత్యంశెట్టి శివరామకృష్ణ తదితరులపై సోమవారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. క్షతగాత్రులను అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయరెడ్డి క్షతగాత్రులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయిందన్నారు. ఆయన వెంట నల్లమిల్లి మురళీ మోహన్ బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటీ భీమేష్, ఎంపీటీసీ మార్నేళ్ల భీష్ముడు, మాజీ ఎంపీటీసీ నిడదవోలు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



అనపర్తి ఏరియా ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

నవంబర్ 3న శెట్టిబలిజల వనసమారాధన

ప్రకాశం నగర్: ఈ ఏడాది నవంబర్ 3న రాష్ట్ర స్థాయి శెట్టిబలిజ వనసమారాధన నిర్వహిస్తున్నామని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అన్నారు. తిలక్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయిలో శెట్టిబలిజలతో వనసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉచిత వివాహ వేదిక నిర్వహిస్తామని, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన శెట్టిబలిజ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎం.సత్యనారాయణ, గుబ్బల ఉదయ్ భాస్కరరావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు ఏచూరి కృషి

కడియం: సమ సమాజ స్థాపనకు సీతారాం ఏచూరి చేసిన కృషి మరువలేనిదని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. సీతారాం తన బాల్యాన్ని గడిపిన జేగురుపాడు గ్రామంలో సోమవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్టాలిన్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి అంతర్జాతీయ ఐకాన్‌గా మారిన సీతారాం ఏచూరి అడుగుజాడలు తమ గ్రామమైన జేగురుపాడులో ఉండటం ఎంతో గర్వకారణం అన్నారు. నిమ్నవర్గాల అభ్యున్నతికి, సమాజంలో అంతరాలు రూపుమాపడానికి ఆయన చేసిన కృషి, పోరాటాలు ఒక చరిత్ర అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరుపొందిన ఏచూరి నేటి సమాజానికి దిక్సూచి అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి వీరశివాజీ, అద్దంకి సుజాత వెంకట రమణారావు, పాలపర్తి ప్రకాష్‌కుమార్ పాల్గొన్నారు.



జేగురుపాడులో ఏచూరికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ స్టాలిన్ తదితరులు

'పోలవరం'పై మరో శ్వేతపత్రం విడుదల చేయాలి

సీటీఆర్ఐ: పెరిగిన అంచనా వ్యయాలతో పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడంతో నిర్వాసితుల సంఖ్య మరింత పెరుగుతోందన్నారు. 2020 ఫిబ్రవరి 29న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ బి.సుధాకర్ బాబు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో ఎస్టీలు 56,495, ఎస్సీలు 7,134, ఓబీసీలు 34,266, ఓసీలు 7,706.. మొత్తం 1,05,601 కుటుంబాలు వారు నిర్వాసితులవుతున్నారన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి వ్యక్తి ఒక కుటుంబంగా కొత్త భూసేకరణ చట్టం పేర్కొందన్నారు. 2020 నాటికి 14 ఏళ్లు ఉన్నవ్యక్తి ఇప్పుడు 18 ఏళ్లకు రావడంతో ఒక కుటుంబంలా పరిగణించబడతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో మొత్తం నిర్వాసితుల సంఖ్య 96,660గా వెల్లడించారన్నారు. అంటే సుమారు 10 వేల కుటుంబాలను తగ్గించి చూపించారన్నారు. ఏ గ్రామాలను ముంపు నుంచి తప్పించారో వివరణ ఇవ్వలేదన్నారు. శ్వేతపత్రంలో చంద్రబాబు చెప్పిన ఈ లెక్కలన్నీ వాస్తవం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2007లో ఇచ్చిన ఆదేశాల మేరకు మొత్తం 276 గ్రామాలకు భూసేకరణ పూర్తి చేసి నష్టపరిహారం, ఆర్అర్ ప్యాకేజీ చెల్లించిన తరువాతనే ప్రాజెక్టులో నీరు నింపే నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇవన్నీ జరగాలంటే భూసేకరణకు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కి సుమారు రూ.లక్ష కోట్లు అవసరముంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిపుణులతో చర్చించి తిరిగి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని లెక్కకట్టాలన్నారు.



శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న ఆదివాసీ మహాసభ సభ్యులు

ఆవ కాలువకు మోక్షం కలిగేనా..

- ఆక్రమణలు, పూడికతో అధ్వానంగా మారిన వైనం
- హుకుంపేటలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు పనులు
- బొమ్మూరులో ప్రారంభమెప్పుడో..



చెరుకూరి గోడౌన్స్ నుంచి బాలాజీపేట వరకూ ఆక్రమణకు గురైన కాలువ

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరద ఉధృతంగా ఉన్న సమయంలో బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లో పలు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. వరద తగ్గే వరకూ ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఆవ కాలువలో పూడికతీత పనులు జరగకపోవడమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ప్రశాంతి ముంపు ప్రాంతాలను పరిశీలించి, ఆవకాలువ వెంబడి ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో హుకుంపేట గ్రామంలో ఆప నులు చేపట్టారు, కానీ బొమ్మూరులో ఇంకా మొదలు కాలేదు.

హుకుంపేటలో జోరుగా..

కలెక్టర్ ఆదేశాల మేరకు హుకుంపేటలో అధికారులు చర్యలు ప్రారంభించారు. ఆవ కాలువ వెంబడి ఆక్రమణల తొలగించడంలో భాగంగా కాలువ వెంబడి ఉన్న భవనాలకు, ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. త్వరితగతిన ఖాళీ చేయాలని, లేని పక్షంలో భవనాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. మరోవైపు ఆవ కాలువలో పూడికతీత పనులు సైతం జోరుగా సాగుతున్నాయి. కానీ బొమ్మూరులోని ఆవకాలువ వెంబడి ఆక్రమణలతో పాటు పూడికలను సైతం మొదలు కాలేదు.

ఆక్రమణలను తొలగించాలి

బొమ్మూరులోని బాలాజీపేట సెంటర్ నుంచి నేతాజీ నగర్ మీదుగా సుద్దగని రైల్వేట్రాక్ వరకు ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టాలి. అంతే కాకుండా పూడికలను తీయాల్సిన అవసరం ఉంది. కానీ అధికారులు ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బొమ్మూరు ఆవ కాలువ వెంబడి భవనాలు, ప్రహరీలు చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. నవభారతీ నగర్ ప్రాంతంలో ఆవ కాలువను ఆక్రమించుకోవడంతో పాటు కనీసం పూడికలు తీసేందుకు జేసీబీలను వెళ్లకుండా అడ్డుకున్న సందర్భాలు సైతం అనేకం ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి చెరుకూరి గోడౌన్స్ దగ్గర నుంచి బాలాజీపేట వరకు భారీగానే ఆక్రమణలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఎండలు తీవ్రతరంగా ఉన్న నేపథ్యంలోనే ఆవకాలువ ఆక్రమణలు తొలగిస్తే బాగుంటుందని గ్రామప్రజలు కోరుతున్నారు. ఇంకా సర్వేయర్లు పూర్తిస్థాయిలో సర్వే చేయకపోవడం వలనే ఆక్రమణలు తొలగింపునకు ఆలస్యమవుతుందని కొందరు చెబుతున్నారు.



బొమ్మూరులో ఆవ కాలువ పరిస్థితి